జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
శనివారం 10 అక్టోబర్ 2026 | పేజీలు : 8



# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

నిర్మల్ రైజింగ్--2047 లక్ష్యంగా
వినూత్న వ్యాపారాలకు చేయూత

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




# హెచ్ఐవీ రహిత మంచిర్యాల జిల్లానే లక్ష్యం




# ప్రతీ బిడ్డ రోజూ పాఠశాలకు వెళ్లాలి

గ్రామాభివృద్ధి, యువత నైపుణ్యాలపై కీలక తీర్మానాలు

విద్య, ఆరోగ్యం, ఉపాధిరం గాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ఐటీడీఏ పీఓ మంద మకరందు



గిరిజన గ్రామాల్లో విద్యాభి వృద్ధి, చిన్నారుల ఆరోగ్యం, యువతకు నైపుణ్య శిక్షణ, ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పిం చే లక్ష్యంతో స మగ్ర కార్యాచరణ రూపొందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మందమ కరందు సూచించారు. ఉట్నూరు మండల కేంద్రంలోని కొమరం భీం కాంప్లెక్స్ సమావేశ మందిరంలో నాలుగు జిల్లాల సార్మేడీలతో విద్య, గ్రామాభివృద్ధి అంశాల పై ఆయన

# వానాకాలం పంటలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి



యాసంగి సాగు ప్రణాళికను నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**మంచిర్యాల, 9,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో వానాకాలం పంటల పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రానున్న యాసంగి 2026--27 సాగు ప్రణాళికను నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, సాగునీటి వనరులకు అనుగుణంగా రూపొందించాలని సూచించారు. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

# హెచ్ఐవీ రహిత మంచిర్యాల జిల్లానే లక్ష్యం

## అవగాహనతో అపోహలు తొలగించాలి.. బాధితుల పట్ల వివక్ష విడనాడాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్








**మంచిర్యాల, 9,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు చేపట్టిన ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఉన్న అపోహలను తొలగించి, బాధితుల పట్ల సమాజంలో నెలకొన్న వివక్షను తగ్గించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వచ్చిన కళాజాత బృందాల ద్వారా జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ నివారణకు సురక్షిత జీవన విధానాలను పాటించడం, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం, వ్యాధి నిర్ధారణ అయిన వారు సకాలంలో చికిత్స పొందడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. హెచ్ఐవీ బాధితులను వివక్షకు గురిచేయకుండా వారికి అండగా నిలవాలని, వ్యాధిపై సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 2,832 హెచ్ఐవీ కేసులు నమోదైనట్లు డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. బాధితులకు వైద్య సేవలు, చికిత్స అందించడంతో పాటు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ నివారణ, గుర్తింపు, చికిత్సకు సంబంధించి 95-95-95 లక్ష్యాల సాధనలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో హెచ్ఐవీతో జీవిస్తున్న వారు ఆదిలాబాద్‌లోని ట్రీమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి, రామగుండం కేంద్రాల్లో యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్సలు పొందుతున్నారని వివరించారు. సకాలంలో చికిత్స తీసుకోవడం వల్ల శరీరంలో వైరస్ లోడ్ తగ్గి బాధితుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, వైరస్ ఇతరులకు వ్యాపించే ప్రమాదం కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. హెచ్ఐవీ నియంత్రణలో యువత పాత్ర అత్యంత కీలకమని, భవిష్యత్తు తరాలను ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడేందుకు యువత చురుకుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు జిల్లాలోని ప్రజలందరూ హెచ్ఐవీ నివారణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. సమష్టి కృషి, నిరంతర అవగాహనతో మంచిర్యాల జిల్లాను హెచ్ఐవీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, దిశా హెచ్ఐవీ కోఆర్డినేటర్ నీలిమ, వైద్య బృంద సభ్యులు కాకిరాల వెంకటేశ్వర్లు, ధూప్‌సింగ్, రషీద్, ఆర్.ఎస్. పద్మ, సురేందర్, శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలు, స్నేహ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, దిశా సభ్యులు సంతోష్, రాజేష్, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలోకి 42 మంది కార్మికులు

## అంకుశాపూర్ మెడికల్ కాలేజీలో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

### కార్మిక హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి: సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 9 ప్రజా జ్యోతి** కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంకుశాపూర్ మెడికల్ కాలేజీ కార్మికులు సంఘటితమయ్యారు. కాలేజీలో పనిచేస్తున్న 42 మంది కార్మికులు ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలోకి చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నూతన జిల్లా కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె. రాజేందర్, జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి కార్మికులకు కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కార్మికుల సమస్యలు, హక్కుల సాధనకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమన్నారు. వేతనాల సమస్యలు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన ప్రయోజనాల సాధనకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులు ఏ సంఘంలో ఉన్నా హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండటం ముఖ్యమని పేర్కొన్నారు. కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలపై నిరంతరం పోరాడటమే సీఐటీయూ లక్ష్యమని తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్మికులు సంఘంలో చేరడం ఐక్యతకు నిదర్శనమన్నారు.జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ అండగా ఉంటుందని చెప్పారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**నూతన జిల్లా కమిటీ ఇదే**

అధ్యక్షురాలిగా స్వాతి, కార్యదర్శిగా సిద్ధార్థ, కోశాధికారిగా భాగ్య



ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా స్వామి, సుశీల, శైలు; సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, సౌందర్య, రవీందర్; సోషల్ మీడియా బాధ్యుడిగా రాజేష్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా సుగుణ, రాధిక, మౌనిక, హారికలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు సీఐటీయూ జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సింగరేణి అధిక ప్రాధాన్యం

### క్రీడాకారులు, కళాకారులను ప్రోత్సహించడంలో ముందంజ
### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్
### ఆధునీకరించిన షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులు ప్రారంభం







**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అధిక ప్రాధాన్యత ఇస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. క్రీడాకారులు, కళాకారులను ప్రోత్సహించేందుకు సంస్థ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని అన్నారు . శ్రీరాంపూర్ ఏరియా ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో పునరుద్ధరించిన షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను శుక్రవారం జి.ఎం ప్రారంభించారు. అనంతరం కళాకారుల ప్రోత్సాహం కోసం నూతనంగా కొనుగోలు చేసిన సంగీత వాయిద్య పరికరాలను కళాకారులకు అందజేశారు. ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో ఉన్న షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు కొద్ది రోజుల క్రితం దెబ్బతినడంతో క్రీడాకారులు, క్లబ్ సభ్యులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తికి స్పందించిన మునిగంటి శ్రీనివాస్ సంబంధిత అధికారులను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు టేబుల్ టెన్నిస్ కోర్టుల మరమ్మతులు, ఆధునీకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. శుక్రవారం జీఎం వాటిని ప్రారంభించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జీఎం స్వయంగా కొద్దిసేపు షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఆడి క్రీడాకారులు, ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. అలాగే నూతనంగా అందజేసిన సంగీత వాయిద్య పరికరాలను వాయిస్తూ కళాకారులను ప్రోత్సహించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల అభివృద్ధికి సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా క్రీడా ప్రాంగణాలు, క్లబ్‌లు, పార్కులు, క్రీడా సామగ్రి వంటి సౌకర్యాలను కల్పిస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఏరియా స్థాయి, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో పోటీలను నిర్వహిస్తూ క్రీడాకారులు, కళాకారులకు అవకాశాలు కల్పిస్తోందని వివరించారు. ప్రస్తుతం ప్రారంభించిన సౌకర్యాలను క్రీడాకారులు, కళాకారులు సద్వినియోగం చేసుకుని శ్రీరాంపూర్ ఏరియాకు కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని జీఎం కోరారు. ఈ నెల 13, 14 తేదీల్లో శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించనున్న కంపెనీ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు, శ్రీరాంపూర్ క్రీడాకారులు అత్యధిక బహుమతులు సాధించి ఎక్కువ సంఖ్యలో కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, సివిల్ హెచ్ఓడీ రవికుమార్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ మురళీకృష్ణ యాదవ్, సీఈఆర్ క్లబ్ సెక్రటరీ కొట్టె కిషన్ రావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సురేష్, క్రీడాకారులు, కళాకారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

### భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలి
### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

**మంచిర్యాల, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత, ఈ-వ్యర్థాల సక్రమ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, బొగ్గు మంత్రిత్వ శాఖ సూచనల మేరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్--6లో భాగంగా శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియం, సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో జీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, పేపర్లు, రాలిన ఆకులు, ఇతర చెత్తను ఏరియా అధికారులతో కలిసి తొలగించారు. జీఎం స్వయంగా చీపురు పట్టి చెత్తను ఊడ్చి ఒకచోటకు చేర్చడంతో ఉద్యోగులు సైతం ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని కార్యాలయాలు, గనుల్లో ప్రతిరోజూ పరిసరాల పరిశుభ్రతతోపాటు ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాలను





నిర్వహిస్తున్నట్లు జీఎం తెలిపారు. స్పెషల్ క్యాంపెయిన్--6ను శ్రీరాంపూర్ ఏరియాలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యాలయాలు, గనుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలను సక్రమంగా తొలగించాలన్నారు. అక్టోబర్ 31వ తేదీ నాటికి శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని కార్యాలయాలు, గనులను పర్యావరణహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, సివిల్ హెచ్ఓడీ రవికుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్





మురళీకృష్ణ యాదవ్, సీనియర్ పీఓ పాల్ సృజన్, క్రీడాకారులు, కళాకారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# “ ప్రజా జ్యోతి” పత్రిక కథనానికి స్పందన.. ప్రారంభమైన ట్రాఫిక్ సిగ్నల్స్!

## రెండు రోజుల్లోనే సమస్యకు పరిష్కారం.. ప్రజల్లో హర్షం

## ప్రజా సమస్యల పరిష్కారంలో “ప్రజాజ్యోతి” ప్రత్యేక చొరవ







**మంచిర్యాల, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో జాతీయ తెలుగు దినపత్రిక “ ప్రజా జ్యోతి” ఎల్లప్పుడూ ముందుంటుందనడానికి మంచిర్యాల పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం కావడం మరో నిదర్శనంగా నిలిచింది. ప్రజలకు, వాహనదారులకు ఎంతోకాలంగా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యపై ఈనెల 6 న ప్రజా జ్యోతి ప్రచురించిన “పోల్స్ వచ్చాయి... సిగ్నల్స్ వచ్చాయి.. కానీ ప్రారంభం ఎప్పుడు.. ????” అనే ప్రత్యేక కథనానికి కేవలం రెండు రోజుల్లోనే స్పందన లభించింది. నెలల తరబడి ప్రారంభానికి నోచుకోని ట్రాఫిక్ సిగ్నల్స్ శుక్రవారం ఉదయం నుంచి పనిచేయడం ప్రారంభించడంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన సిగ్నల్స్ ఇన్నాళ్లకు అందుబాటులోకి రావడంతో నగరవాసుల్లో ఆనందం వ్యక్తమైంది. శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, శ్రీరాంపూర్ ఏరియాలోని బొగ్గు గనుల్లో విధులకు బయలుదేరిన కార్మికులు, నిత్యావసర వస్తువుల కొనుగోళ్ల కోసం బయటకు వచ్చిన మహిళలు, వృద్ధులు ట్రాఫిక్ సిగ్నల్స్ వెలగడాన్ని గమనించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సిగ్నల్స్ పనిచేయడం ప్రారంభించడంతో వాహనదారులు కూడా అప్రమత్తమయ్యారు. ఎరుపు రంగు సిగ్నల్ వెలగగానే స్టాప్ లైన్ వద్ద వాహనాలను నిలిపివేస్తూ, ఆకుపచ్చ రంగు సిగ్నల్ వెలిగిన తర్వాత తమకు కేటాయించిన మార్గంలో ముందుకు సాగడం కనిపించింది. దీంతో గతంలో మాదిరిగా ఇష్టానుసారంగా వాహనాలు ముందుకు వెళ్లకుండా, ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ప్రమాదాల నివారణకు ఈ సిగ్నల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని వాహనదారులు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఐబీ చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ టాకీస్ సమీపంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నేడు ప్రారంభమయ్యాయి. సిగ్నల్స్ వద్ద నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై జరిమానాలు విధించేందుకు పోలీసు సిబ్బంది కూడా విధుల్లో ఉండటం కనిపించింది. దీంతో ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే సందేశం ప్రజల్లోకి వెళ్లింది. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకొస్తే పరిష్కారం సాధ్యమేనని ఈ ఘటన మరోసారి నిరూపించింది. “ ప్రజాజ్యోతి” ప్రచురించిన ప్రత్యేక కథనంపై మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవడంతో ప్రజలకు మేలు చేకూరింది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికల పాత్ర ఎంత కీలకమో ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేసిన నగరవాసులు, వాహనదారులు ప్రజా సమస్యను గుర్తించి కథనం ప్రచురించిన ప్రజా జ్యోతి పత్రికకు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పట్టణంలోని ఇతర ప్రజా సమస్యలపైనా అధికారులు దృష్టి సారించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, సమస్యల పరిష్కారానికి వారధిగా పనిచేసే “ ప్రజాజ్యోతి” పాత్రకు ఈ ఘటన మరో మంచి ఉదాహరణగా నిలిచింది.

## మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులతో కలిసి సందడి చేసిన సురేఖమ్మ



**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శ్రీమతి సల్ల రమ్య--మహేష్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థినులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సురేఖమ్మ పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కళాశాల ఉపాధ్యాయులు సురేఖమ్మను శాలువాతో సత్కరించారు.

## పూల సోయగాల నడుమ.. బతుకమ్మ సంబరాలు!

--శ్రీహర్ష కళాశాలలో విద్యార్థినీ విద్యార్థుల సందడి



**మంచిర్యాలరూరల్ అక్టోబర్09(ప్రజాజ్యోతి)** విద్యార్థినీ విద్యార్థుల ఆటపాటలు,రంగురంగుల పూల బతుకమ్మలతో శ్రీహర్ష డిగ్రీ,జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈసందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడారు.ఉత్సాహాభరితమైన ఆటపాటలతో కళాశాల ప్రాంగణమంతా సందడిగా మారింది.తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.విద్యార్థులు సంతోషంగా వేడుకల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారుఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ పల్లె భూమేష్, డైరెక్టర్లు పోటు మనోహర్ రెడ్డి, తనుగుల శ్రావణ్,ప్రిన్సిపాళ్లు ఆరెల్లి అనిత,ఆరె లావణ్యతో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గత వర్షాలకు కింద పడిన ట్రాన్స్ఫార్మర్ పోల్

పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



**జన్నారం,అక్టోబర్9(ప్రజాజ్యోతి)** గత పదిహేను రోజుల క్రితం కురిసిన వర్షాలకు జన్నారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మగ్గిడి తిరుపతి అనే రైతు కు చెందిన పొలంలో ట్రాన్స్ఫార్మర్ స్తంభం పడిపోయిందని,దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసిన గాని పట్టించుకోవడంలేదని రైతు మగ్గిడి తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ స్తంభం పడిపోయి ఇప్పటికి 15 రోజులు గడిచిపోయింది అని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న, ఈ రోజు రేపు అంటూ కాలక్షేపం చేస్తున్నారు. నీరు, కరెంటు సరిగా అందక ఇప్పటికే తీవ్రంగా నష్టపోతున్నామని, కనీసం కరెంట్ ఉన్న సమయంలోనైనా పంపుమోటార్ వాడుకుందాం అంటే ట్రాన్స్ఫార్మర్ పోలు పడిపోవడం,అధికారులు మరమ్మతులు చేయకపోవడం తో ఇంకా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.

# జిల్లాలో యాదవుల బలోపేతమే లక్ష్యం!

**...ఐక్యతతోనే సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి.జిల్లా, మండల కమిటీల నియామకాలకు శ్రీకారం..**

**...అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ పిలుపు**

**...దండేపల్లి, హాజీపూర్ మండలాలకు నూతన అధ్యక్షులు**

**మంచిర్యాల ప్రతినిధి: అక్టోబర్ 9 ప్రజా జ్యోతి** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా యాదవ సామాజిక వర్గాన్ని సంఘటితపరిచి, వారి హక్కుల పరిరక్షణతోపాటు సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా అఖిల భారత యాదవ మహాసభ ముందుకు సాగుతోంది. యాదవులంతా విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని, సంఘటిత శక్తితోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తన నివాసంలో వివిధ మండలాల సంబంధించిన మండల అధ్యక్షులను ప్రకటించారు సందర్భంగా బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీల నియామకాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

**...ఐక్యతే యాదవుల అభివృద్ధికి పునాది!**

సమాజంలో యాదవుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతోపాటు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవగాహన కల్పించడం, యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శనం చేయడం వంటి అంశాలపై సంఘం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అఖిల భారత యాదవ మహాసభను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టం చేయాలనే లక్ష్యంతో కమిటీల నియామక ప్రక్రియను ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సంఘంలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పిస్తూ, ఐకమత్యంతో ముందుకు సాగితేనే యాదవ సామాజిక వర్గం అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని ఆయన అన్నారు.

**..మండల కమిటీల నియామకాలకు శ్రీకారం**

మంచిర్యాల జిల్లాలో అఖిల భారత యాదవ మహాసభ





కార్యకలాపాలను విస్తరించేందుకు మండలాల వారీగా నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా దండేపల్లి, హాజీపూర్ మండలాలకు అధ్యక్షులను నియమించారు. దండేపల్లి మండల అధ్యక్షుడిగా అల్లంల మల్లేష్ యాదవ్‌ను, హాజీపూర్ మండల అధ్యక్షుడిగా అల్లంల నాగన్న యాదవ్‌ను నియమించారు. మండల స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయడం, యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజలను సంఘటితం చేయడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి బాధ్యతలను నూతన అధ్యక్షులు చేపట్టాల్సి ఉంటుంది. మండల కమిటీల ఏర్పాటు ద్వారా సంఘ కార్యకలాపాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడనుంది. గ్రామాల్లోని యాదవ కుటుంబాలతో సంబంధాలు పెంపొందించుకోవడం, యువతను సంఘ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. హక్కుల సాధనకు సంఘటిత పోరాటందసామాజిక వర్గాల అభివృద్ధిలో సంఘాల పాత్ర కీలకమైనది. విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో యాదవ సామాజిక వర్గం మరింత పురోగతి సాధించాలంటే ఐక్యతతో కూడిన కార్యాచరణ అవసరం. కేవలం కమిటీల నియామకాలకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసినప్పుడే సంఘానికి క్షేత్రస్థాయిలో ఆదరణ పెరుగుతుంది. మహాసభ నాయకత్వం మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తూ, సంఘ కార్యకలాపాలను విస్తరించడంతోపాటు యాదవుల మధ్య ఐక్యతను పెంపొందించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువత, విద్యార్థులు, మహిళలను సంఘ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి మరింత విస్తృతమైన పునాది ఏర్పడుతుంది.

**..కమిటీలతో కొత్త బాధ్యతలు అభివృద్ధిపై ఆశలు!**

జిల్లా, మండల కమిటీల నియామకాలతో అఖిల భారత యాదవ మహాసభ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయి. నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు తమ పరిధిలోని యాదవ సామాజిక వర్గ ప్రజలను సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని బలోపేతం చేయాల్సి ఉంటుంది. గ్రామస్థాయి సమస్యల నుంచి సామాజిక హక్కుల సాధన వరకు ప్రతి అంశంపై బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. యాదవుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, యువతకు అవకాశాల కల్పన, పేద కుటుంబాల అభ్యున్నతి వంటి లక్ష్యాలతో సంఘం ముందుకు సాగితే జిల్లాలో యాదవ సామాజిక వర్గ అభివృద్ధికి మరింత దోహదపడే అవకాశం ఉంది. మొత్తంగా, మంచిర్యాల జిల్లాలో యాదవులను సంఘటితపరిచి, వారి అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన కమిటీల నియామకాలు రానున్న రోజుల్లో ఎలాంటి కార్యాచరణకు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. నూతన కమిటీలు ప్రజలతో మమేకమై, ఐక్యతను పెంపొందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే వాటి ముందున్న ప్రధాన బాధ్యత అని ఆయన తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులను శాలువాతో సన్మానించి నియమక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి

**విద్యార్థినులకు మహిళా భద్రత, సైబర్ నేరాలపై షీ టీం అవగాహన**

**మంచిర్యాల, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** సోషల్ మీడియాను పరిమితంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని మంచిర్యాల జోన్ షీ టీం ఎస్ఐ ఉషారాణి విద్యార్థినులకు సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల జోన్ పరిధిలోని వేంపల్లి అభ్యాస జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల సందర్భంగా మహిళా భద్రత, సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళల ఆత్మగౌరవం, ఐక్యతను చాటేలా కళాశాలలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో విద్యాసంస్థలు, అధ్యాపకులు, విద్యార్థినుల పాత్ర కీలకమని అన్నారు. ప్రస్తుత కాలంలో యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, అవసరానికి మించి ఫోన్లు వినియోగించడం వల్ల విలువైన సమయం వృథా అవుతుందని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి యాప్‌లను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, వీడియోలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలను వెల్లడించే ముందు భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలను ఆలోచించాలని అన్నారు. వ్యక్తిగత ఫోటోలను కొందరు దుర్వినియోగం చేసి బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా, సమస్యను దాచిపెట్టకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు సోషల్ మీడియాలో వేధింపులు, బ్లాక్‌మెయిల్ లేదా ఇతర ఇబ్బందులకు గురైతే షీ టీంను ఆశ్రయించవచ్చని తెలిపారు. బాధితుల వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడుతూ, చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి షీ టీం అండగా



ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థినులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసుల సహాయం పొందాలని ఎస్ఐ ఉషారాణి సూచించారు. మహిళల భద్రత, గౌరవం, రక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసులు, షీ టీమ్స్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాయని స్పష్టం చేశారు.

# నాయకపుగూడలో అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో చీరల పంపిణీ






**తిర్యాణి, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తిర్యాణి మండలంలోని నాయకపుగూడ గ్రామపంచాయతీలో శుక్రవారం అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. యువ సైన్యం వ్యవస్థాపకుడు జువ్వాజీ అనిల్ గౌడ్ మహిళలకు చీరలు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. మహిళలు సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయడం, నిరుపేదలకు అండగా నిలవడం, యువతను ప్రోత్సహించడం తమ యువ సైన్యం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు, క్రీడాకారులకు క్రీడా సామగ్రి, ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించామని గుర్తుచేశారు. చెలిమిల కొల్లంగూడలో హనుమాన్ ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రతి ఆడపడుచు ముఖంలో చిరునవ్వు చూడటమే తమకు సంతృప్తినిస్తుందని అన్నారు. మహిళల ఆశీస్సులతో సమాజ సేవలో నిరంతరం ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకపుగూడ సర్పంచ్ ఎదుల సుమలత శ్రీనివాస్, తిర్యాని సర్పంచ్ మడావి రాజేష్, ఉప సర్పంచ్ కొదురుపాక పవన్, పెరుమండ్ల వెంకటేశం గౌడ్, బొల్లం శంకర్, మేడిశెట్టి శంకర్, పడగల అమర్, చుంచు చంద్రమౌళి, ఎలుగతి వెంకటేశం అంకతి వెంకటేశం అంకతి శ్రావణ్, దురిశెట్టి సతీష్, గుండం కిష్టయ్య, బైరోజు రాజశేఖర్, పెట్టం రాయలింగు, బద్ది రాజక్క, వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు

## క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స

**డాక్టర్ మచ్చ కిరణ్ కుమార్**




**మంచిర్యాల, ప్రతినిధి అక్టోబర్ 09 ప్రజా జ్యోతి** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, జీవనశైలి మార్పులు, పొగాకు వినియోగం, అవగాహన లోపం ఇందుకు ప్రధాన కారణాలని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మచ్చ కిరణ్ కుమార్ మెడికల్ అంకలాజిస్ట్ తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలో ప్రముఖ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స తీసుకుంటే కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. నోటిలో పుండ్లు, తగ్గని దగ్గు, శరీరంపై గడ్డలు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. 40--45 ఏళ్లు దాటినవారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలుచేయించుకోవాలన్నారు మహిళలు రొమ్ము స్వీయ పరీక్షతో పాటు వైద్యుల సూచన మేరకు మామోగ్రఫీ, పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. యశోద ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్సకు ఆధునిక రేడియేషన్ సాంకేతికత, రోబోటిక్ శస్త్రచికిత్స సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి మేనేజర్ అంకం మల్లేష్ పాల్గొన్నారు.

## కామ్రే మల్లయ్యకు కాంగ్రెస్ నేతల నివాళి

**కుటుంబ సభ్యులను పరామర్శించిన అజ్మీరా శ్యామ్ నాయక్**



**ఆసిఫాబాద్, అక్టోబరు 9 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మి భర్త, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ తండ్రి కామ్రే మల్లయ్య పెద్దకర్మ కార్యక్రమానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ మంగ, ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ ఉపాధ్యక్షుడు తారిఖ్, మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, వాంకిడి మండల మాజీ అధ్యక్షుడు గుర్నూలే నారాయణ, సామెల సర్పంచ్ సంతోష్, వాంకిడి ఉపాధ్యక్షుడు పెంటు, సామెల రమేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న కౌన్సిలర్‌కు పరామర్శ

**గోవింద్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన విశ్వప్రసాద్, ఆత్రం సక్కు**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 9 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ వైరగడే గోవింద్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆయనను పరామర్శిం చారు. శుక్రవారం గోవింద్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గోవింద్ ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలుసుకుని, ఆయన కోలుకునేందుకు అవ సరమైన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అనారోగ్యంతో ఉన్నవారిని పరామర్శించడం ఆత్మీయతను పెంపొందిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ రాపర్తి కార్తీక్, రాజంపేట వార్డుకు చెందిన కుమురం వేణు, మూడో వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వైరగడే సాయి, నిఖిల్, సాయి, బండి సాయి కుమార్ యాదవ్, శేఖర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా!

**వైద్య విద్యార్థుల ధర్నాకు కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్ మద్దతు**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 9 ప్రజా జ్యోతి** వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్య విద్యార్థులు చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, సమస్యల పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు. వైద్య విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని శ్యామ్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నిజం, రావి నాయక్, అజ్మీర్ తిరుపతి నాయక్, మాజీ జడ్పీటీసీ సోమయ్య, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచిర్యాల ఆర్టీసీ ఎన్నికల్లో హోరాహోరీ పోరు!

**403 ఓట్లకు 328 ఓట్లు పోలింగ్.. 81.4 శాతం నమోదు**

**మహాకూటమి--జేఏసీ మధ్య ప్రధాన పోటీ.. బాణం, బస్సు గుర్తులపై ఉత్కంఠ**

**కార్మిక సమస్యలే ప్రధాన ఎజెండా.. ప్రశాంతంగా ముగిసిన పోలింగ్**









**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో కార్మిక సంఘాల ఎన్నికల పోరు హోరాహోరీగా సాగింది. దాదాపు పదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో మంచిర్యాల ఆర్టీసీ డిపోలో శుక్రవారం పోలింగ్ ఉత్కంఠభరిత వాతావరణంలో కొనసాగింది. మొత్తం 403 మంది ఓటర్లకు గాను 328 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 81.4 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే డిపో పరిసరాల్లో ఎన్నికల సందడి నెలకొనగా, పోటీలో ఉన్న కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఆకట్టుకునేందుకు ముమ్మర ప్రచారం నిర్వహించారు. చివరి నిమిషం వరకు తమ సంఘాల విజయమే లక్ష్యంగా హామీలను వివరిస్తూ ప్రచారాన్ని హోరెత్తించారు.

**మహాకూటమిగా బాణం గుర్తుపై పోటీ.. జేఏసీగా బస్సు, నిచ్చెన గుర్తులతో బరిలోకి...**

ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో పలు సంఘాలు కూటములుగా ఏర్పడి పోటీ చేశాయి. టీఎస్ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి ఆధ్వర్యంలో టీఎస్ఆర్టీసీ వర్కర్స్ యూనియన్, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్ఎన్‌యూ, ఐఎన్‌టీయూసీ సంఘాలు మహాకూటమిగా ఏర్పడి బాణం గుర్తుపై బరిలో నిలిచాయి. మరోవైపు ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్‌లు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి రాష్ట్ర గుర్తింపు సంఘం ఎన్నికల్లో బస్సు గుర్తుపై, స్థానిక సంఘం ఎన్నికల్లో నిచ్చెన గుర్తుపై పోటీ చేశాయి. అదేవిధంగా మల్లన్నకు చెందిన టీఆర్‌పీ పార్టీ మద్దతుతో బహుజన వర్కర్స్ యూనియన్ కత్తెర గుర్తుపై పోటీ చేసింది. దీంతో మంచిర్యాల డిపోలో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది.

**రాత్రింబగళ్లు ప్రచార హోరు.. ప్రధాన సంఘాల మధ్య నువ్వా--నేనా?**

మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఎన్నికల ప్రచారం రాత్రింబగళ్లు తేడా లేకుండా జోరుగా సాగింది. పోటీలో ఉన్న సంఘాల నాయకులు, కార్యకర్తలు డిపో వెలుపల టెంట్లు ఏర్పాటు చేసుకుని కార్మికులను కలిశారు. తమ సంఘాలకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎన్నికల హామీలను వివరించారు. పోలింగ్ రోజైన శుక్రవారం ఉదయం నుంచి కూడా ప్రచారం కొనసాగించారు. పరిస్థితిని పరిశీలిస్తే తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ మహాకూటమి, టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నట్లు కనిపించింది. అయితే కార్మికులు ఎవరికి మద్దతు పలికారన్నది ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాతే స్పష్టం కానుంది.

**కార్మిక సమస్యలే ప్రధాన ఎజెండా.. పరిష్కారానికి హామీలు**

ఎన్నికల్లో కార్మికుల దీర్ఘకాలిక సమస్యలే ప్రధాన ఎజెండాగా మారాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, వేతనాలు పెంచడం, పెన్షన్ ప్రయోజనాలను మెరుగుపరచడం, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవడం వంటి అంశాలను ఉద్యోగులు ప్రధానంగా ప్రస్తావించారు. డ్రైవర్లు, కండక్టర్ల విశ్రాంతి గదుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, నల్లులు, దోమల బెడదతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విశ్రాంతి గదుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, కార్మికుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులు సైతం తమ సమస్యలను సంఘాల నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తామని పోటీలో ఉన్న సంఘాలు ప్రచారంలో స్పష్టం చేశాయి.

**గెలుపుపై నాయకుల ధీమా.. ప్రశాంతంగా ముగిసిన పోలింగ్**

శుక్రవారం ఉదయం ఏఐటీయూసీ నాయకుడు బాజీ సైదా మాట్లాడుతూ తమ సంఘం గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఐఎన్‌టీయూసీ నాయకుడు పి.సత్తయ్య కూడా తమ సంఘం విజయం సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. పోటీలో ఉన్న సంఘాల నాయకులు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేయడంతో ఎన్నికల ఫలితాలపై కార్మికుల్లో ఆసక్తి నెలకొంది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉదయం నుంచే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు ఎన్నికల కారణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను యథావిధిగా నడిపించారు. దీంతో ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తంగా మంచిర్యాల ఆర్టీసీ డిపోలో 81.4 శాతం పోలింగ్ నమోదవగా, ప్రధాన కార్మిక సంఘాల మధ్య నెలకొన్న పోటీలో విజేతలు ఎవరనే విషయం ఫలితాల వెల్లడి తర్వాత తేలనుంది.

## రైల్వే ప్రయాణికులకు శుభవార్త..!

**యాదాద్రి రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక రైళ్లకు అదనపు హాల్ట్**

**బతుకమ్మ, నవరాత్రి, దసరా పండుగల రద్దీ నివారణకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం**

**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బతుకమ్మ, నవరాత్రి, దసరా పండుగల నేపథ్యంలో ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. పండుగల సందర్భంగా రైళ్లలో పెరిగే ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ మధ్య ప్రకటించిన ప్రత్యేక రైళ్లకు యాదాద్రి రైల్వే స్టేషన్‌లో అదనపు హాల్ట్ కల్పించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ అక్టోబర్ 9న విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఇప్పటికే అక్టోబర్ 8న విడుదల చేసిన ప్రెస్ రిలీజ్ నంబర్ 431 ద్వారా సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ మధ్య 34 ప్రత్యేక రైలు సర్వీసులను ప్రకటించగా, తాజాగా యాదాద్రి స్టేషన్‌లో అదనపు నిలుపుదల సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రత్యేక రైళ్లు అక్టోబర్ 9 నుంచి 25వ తేదీ వరకు నడవనున్నాయి.

**మంచిర్యాల మీదుగా ప్రత్యేక రైళ్లు.........**

రైలు నంబర్ 07711 సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ చేరుకుంటుంది. ఈ రైలు మంచిర్యాలకు సాయంత్రం 4.11 గంటలకు చేరుకుని 4.12 గంటలకు బయలుదేరుతుంది. బెల్లంపల్లికి సాయంత్రం 4.30 గంటలకు చేరుకుని 4.31 గంటలకు బయలుదేరుతుంది. మరో రైలు నంబర్ 07712 సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మంచిర్యాలకు 6.56 గంటలకు చేరుకుని 6.57 గంటలకు బయలుదేరుతుంది. బెల్లంపల్లికి 6.35 గంటలకు చేరుకుని 6.36 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైలు అదే రోజు రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

**యాదాద్రిలోనూ నిలుపుదల..........**

సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే 07711 ప్రత్యేక రైలు యాదాద్రికి మధ్యాహ్నం 1.09 గంటలకు చేరుకుని 1.10 గంటలకు బయలుదేరుతుంది. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే 07712 ప్రత్యేక రైలు యాదాద్రికి రాత్రి 9.39 గంటలకు చేరుకుని 9.40 గంటలకు బయలుదేరుతుంది. పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీని నియంత్రించడంతో పాటు అదనపు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివరించారు.



# శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

## ...రంగురంగుల బతుకమ్మలతో సందడిగా పాఠశాల ప్రాంగణం

## ...తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పిన విద్యార్థులు

**మందమర్రి టౌన్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం. రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ప్రాంగణాన్ని పండుగ శోభతో నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన రంగురంగుల బతుకమ్మలను ఏర్పాటు చేసి పండుగ ఉత్సాహాన్ని చాటారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పాఠశాల స్థాయిలో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందని, పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ మన ప్రాంతీయ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆధునిక విద్యతోపాటు విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించడం



ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పండుగల ప్రాముఖ్యతను తెలుసుకొని, మన సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కృషి చేయాలని సూచించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఐకమత్యాన్ని, సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రమేశ్‌తోపాటు ప్రైమరీ ఇన్‌చార్జ్ నిత్య, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ తిరుమల, డీన్ రవితేజ, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, జయశ్రీ, రోజా పాల్గొన్నారు. పాఠశాల



డైరెక్టర్లు మల్లంపల్లి శ్రీధర్, శ్రీవిద్య వేడుకల్లో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమిష్టి భాగస్వామ్యంతో వేడుకలు ఉల్లాసభరితంగా సాగాయి. పూల సౌందర్యం, సంప్రదాయాల వైభవం, విద్యార్థుల ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని పరిచయం చేయడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# సింగరేణి ఉద్యోగులకు దసరా పండుగ అడ్వాన్స్

## రెగ్యులర్ ఉద్యోగులకు రూ.25 వేలు.. ఇతర తాత్కాలిక కార్మికులకు రూ.12,500

## ఈ నెల 15న బ్యాంకు ఖాతాల్లో జమ.. 10 సమాన వాయిదాల్లో వసూలు

## ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం 2026 దసరా పండుగను పురస్కరించుకుని సంస్థలో పనిచేస్తున్న హిందూ ఉద్యోగులకు పండుగ అడ్వాన్స్ చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు కార్పొరేట్ సిబ్బంది విభాగంలోని పారిశ్రామిక సంబంధాల విభాగం ఈ నెల 9వ తేదీన సర్క్యులర్ జారీ చేసింది. అక్టోబర్ 20న దసరా పండుగ ఉన్న నేపథ్యంలో అర్హులైన ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో అక్టోబర్ 15న అడ్వాన్స్ మొత్తాన్ని జమ చేయనున్నట్లు వెల్లడించింది. రెండు కేటగిరీలుగా అడ్వాన్స్ .. ఎన్‌సీడబ్ల్యూఏ పరిధిలోని గనుల చట్టం కింద సెలవులకు అర్హత కలిగిన సిబ్బంది, సాధారణ ఉద్యోగులు, కార్మికులు, శిక్షణార్థులు తదితర అర్హులైన ఉద్యోగులకు రూ.25,000 చొప్పున పండుగ అడ్వాన్స్ చెల్లించనున్నారు. గనుల చట్టం కింద సెలవులకు అర్హత లేని బదిలీ కార్మికులు, శిక్షణార్థులతో సహా ఇతర తాత్కాలిక కార్మికులకు రూ.12,500 చొప్పున చెల్లించనున్నారు. అయితే స్టైఫండ్ పొందుతున్న అప్రెంటిస్‌లకు ఈ పండుగ అడ్వాన్స్ వర్తించదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 10 నెలల వాయిదాల్లో వసూలు ఉద్యోగులకు చెల్లించే పండుగ అడ్వాన్స్‌ను 10 సమాన నెలవారీ వాయిదాల్లో తిరిగి వసూలు చేయనున్నారు. 2026 నవంబర్ నెల జీతాలు, వేతనాలను 2026 డిసెంబర్‌లో చెల్లించే సమయంలో మొదటి వాయిదా మినహాయింపు ప్రారంభమవుతుంది. గత ఏడాది పండుగ అడ్వాన్స్ తీసుకుని ఇప్పటివరకు పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించని ఉద్యోగులకు కొత్త అడ్వాన్స్ పూర్తిగా మంజూరు చేయరు. పాత బకాయిలను మినహాయించిన అనంతరం అర్హత మేరకు



మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తారు. ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని విభాగాధిపతులు, గనుల అధిపతులకు యాజమాన్యం ఆదేశించింది. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఉద్యోగులకు ప్రత్యేక నిబంధనలు... పండుగ అడ్వాన్స్ చెల్లించే నెలలోనే పదవీ విరమణ చేయనున్న లేదా వైద్యపరంగా అనర్హులుగా ప్రకటించి ఉద్యోగం నుంచి తొలగించనున్న ఉద్యోగులకు అడ్వాన్స్ చెల్లించరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు . మొదటి వాయిదా మినహాయింపు ప్రారంభమయ్యే సమయానికి వారు కంపెనీ ఉద్యోగుల జాబితాలో ఉండకపోవడమే ఇందుకు కారణం. అలాగే 10 నెలల కంటే తక్కువ సర్వీసు మిగిలి ఉన్న ఉద్యోగుల విషయంలో, వారి పదవీ విరమణ తేదీకి ముందుగానే బకాయి మొత్తాన్ని 10 సమాన నెలవారీ వాయిదాల పరిమితిలో వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశం.. అర్హులైన ఉద్యోగులకు నిర్ణీత తేదీన అడ్వాన్స్ చెల్లించేందుకు స్థానిక బ్యాంకు అధికారులకు ముందుగానే సమాచారం అందించాలని యాజమాన్యం సూచించింది. అన్ని విభాగాల జనరల్ మేనేజర్లు, ప్రాంతీయ సిబ్బంది విభాగాధిపతులు, ఆర్థిక--అకౌంట్స్ విభాగాధిపతులు, అంతర్గత ఆడిట్ విభాగాల అధికారులు ఈ ఉత్తర్వుల అమలుపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సమర్థ అధికారి ఆమోదంతో జారీ చేసిన ఈ ఉత్తర్వులు జీఎం (పర్సనల్), ఐఆర్ అండ్ పీఎం తరఫున సంబంధిత అధికారులకు, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల ప్రతినిధులకు పంపించారు.

# మంచిర్యాల పరువు తీస్తున్న కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలు!

## ఎనిమిది నెలలైనా అభివృద్ధి శూన్యం.. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకవర్గం విఫలం

## సమస్యలు పరిష్కరించకుంటే 600 మందితో కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

## బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం

**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల నగరంలో కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలు నగర పరువును తీస్తున్నాయని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం విమర్శించారు. కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా నగరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకవర్గం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మంచిర్యాల నగర అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ప్రజాప్రతినిధులు అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరంలోని పలు డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, చెత్త తొలగింపు సక్రమంగా జరగడం లేదని అన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, దోమల నివారణ చర్యల లోపం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. వాహనాల రాకపోకలు, ఇతర స్థానిక సమస్యల పరిష్కారంలోనూ పాలకవర్గం తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన కార్పొరేషన్ కార్యాలయం కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాలకు వేదికగా మారడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ మహిళలకు ఎంతో ముఖ్యమైన బతుకమ్మ పండుగ, దసరా వేడుకలు సమీపిస్తున్న తరుణంలో నగరంలో పారిశుద్ధ్యం,



రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రజా సమస్యలను పక్కనపెట్టి కాంగ్రెస్ నాయకులు పరస్పర విమర్శలు, ఆధిపత్య పోరుతో ప్రజావేదికపైకి రావడం మంచిర్యాల ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని అన్నారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వ్యవహారశైలిపై అసమ్మతి వర్గం ఏర్పడిందని, పార్టీలో పరిష్కరించుకోవాల్సిన విభేదాలు బహిరంగంగా బయటపడటం వెనుక కారణాలేమిటని గాదె సత్యం ప్రశ్నించారు. చెరువుల మార్పిడి వ్యవహారం, కూరగాయల గోదాముల అంశాల్లోనూ ఎమ్మెల్యే, మేయర్ వ్యవహారశైలిపై ఆయన విమర్శలు గుప్పించారు. నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వకుండా రాజకీయ విభేదాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలకు నష్టం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు గుమ్మడి శ్రీనివాస్, అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ, తమ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా పాలకవర్గం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పది మందితో కాకుండా 600 మందితో కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితా, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలపై అధికారులు, పాలకవర్గం తక్షణమే స్పందించాలని వారు కోరారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మంచిర్యాల నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై పాలకవర్గం ఇప్పటికైనా దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు అంకం నరేష్, గోగుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాసేతు డిజిటల్ వేదిక

### వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ



**ఆసిఫాబాద్, అక్టోబరు 9 ప్రజా జ్యోతి** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సులభంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు 'కె.బి. ఆసిఫాబాద్ ప్రజాసేతు' డిజిటల్ వేదికను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతోపాటు, స్థానిక సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే ఈ వేదిక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా, రహదారుల దుస్థితి, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలు ఎదురైతే ప్రజాసేతు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఇందుకోసం 7569986036 వాట్సాప్ నంబర్‌కు సమస్యకు సంబంధించిన వివరాలను పంపాలని కోరారు. ఫిర్యాదు చేసేటప్పుడు సమస్య ఉన్న ప్రాంతం పేరు, గ్రామం లేదా వార్డు వివరాలతోపాటు సంబంధిత ఫోటోలను జతచేయాలని తెలిపారు. దీనివల్ల సమస్యను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టేందుకు అధికారులకు వీలవుతుందని వివరించారు. అలాగే ఎఝఆఅఖుఝఏఓ.అఆ వెబ్‌సైట్ ద్వారా కూడా ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎస్ఐఆర్ ను వెంటనే రద్దు చేసి, ఓట్ల చోరీ సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామాచేయాలి

### ప్రజల హక్కులను కాలరస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

### డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టీకానంద్:




**అక్టోబర్ 9,సిర్పూర్-టి కానిస్టేన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేసి ప్రజల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని నిరసన చేశారు, అదే విధంగా ఓట్లను చోరీ చేసిన సిఈసి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకానంద్ మాట్లాడుతూలి భారత రాజ్యాంగం ప్రకారం నడవాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ దేశంలో 13 కోట్ల ఓట్లు కత్తిరింపు చేయడం మాను కోవాలని హెచ్చరించారు భారతదేశంలో పుట్టిన ప్రతి వాడికి ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అలాంటి హక్కుల్ని ఎస్ఐఆర్ పేరుతో ఈరోజు ఓట్లను తొలగించేది రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 సమానత్వ హక్కు ఆర్టికల్ 326 ఎన్నికల భాగస్వామ్య హక్కు లను ఉల్లంఘించడమే అవుతుంది అన్నారు తెలంగాణ రాష్ట్రంలో 13 లక్షల ఓట్లు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఓట్లను తొలగించడం అంటే రాజ్యాంగం పై దాడి చేయడం అని అన్నారు ఓట్లను తొలగించే సిఇసి జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఎలక్ట్రికల్ ఈవీఎం లను రద్దు చేయాలని బ్యాలెట్ పేపర్ల విధానంతోనే ఓటు వినియోగించు కొనేలా చేయాలని సూచించారు. తొలగించిన 13 కోట్ల ఓట్లను ను వెంటనే చేర్పించాలని అన్నారు ఎన్నికల సమయంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి గద్దెనెక్కి నిరుద్యోగ యువతను మోసం చేసిందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వంలో ఓట్ల దొంగతనం,నోట్ల దొంగతనం,చందాల దొంగతనం ప్రశ్నపత్రాల దొంగతనం చేస్తూన కేంద్ర బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం మార్చే కుట్ర చేస్తుందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం నుండి మన దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడిదని అన్నారు రాజ్యాంగాన్ని కాపాడాలి మనువాదాన్ని తరిమి కొట్టాలని అన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరి సతీష్ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి రాజేశ్వర్ మరియు నాయకులు బోర్కుంట బాబ్లు హరీష్ శ్రావణ్ కుమార్ పెద్ది అరవింద్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# కౌటాగూడలో కొత్త పెన్షన్ల ధ్రువీకరణ పరిశీలన

### క్షేత్రస్థాయిలో వివరాలు పరిశీలించిన అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్

**ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ప్రజా జ్యోతి)** కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియలో భాగంగా ఆసిఫాబాద్ మండలంలోని కౌటాగూడ గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మట్ గ్రామాన్ని సందర్శించి పెన్షన్ల ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలు, అర్హతలకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో, సంబంధిత అధికారులు, సర్పంచ్ స్వప్న, లక్ష్మీనారాయణ ఈ పర్యటనలో పాల్గొన్నారు. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధ్రువీకరణ ప్రక్రియను నిర్వహించి, అర్హులైన వారికి



పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో అర్హతల పరిశీలన ద్వారా నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందించేందుకు ఈ పర్యటన చేపట్టారు.

# ముందస్తు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న సురేఖమ్మ



విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య



**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మావతి గార్డెన్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ మెమోరియల్ ఉపాధ్యాయ వృత్తివిద్య కళాశాల (ఎస్ఆర్‌కేఎం డీఐఈడీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్ పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో పాల్గొని విద్యార్థినులతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రమణ, తిరుపతి రెడ్డి, కళాశాల ఉపాధ్యక్షులు, ఇతర ప్రతినిధులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ మండలాన్ని కరువు మండలం ప్రకటించాలి

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో తాసిల్దార్ కు వినతి**

**సిరికొండ, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలాన్ని కరు వు మండలంగా ప్రకటించా లని సిరికొండ మండల బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆపార్టీ నాయకులు ఒరగంటి పెంటన్న, రోహిదాస్, సూర్యకాంత్, అమృత్ రావ్, సూర్యకాంత్, సునీల్, చిన్న రాజన్న, రాజారాం, రాజధానీ తది తరులు స్థానిక తహసీల్దార్‌కు ఒక వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల మండలంలో వర్షాభావ



పరిస్థితులు నెలకొన్నాయని, పంటల దిగుబడి పూర్తిగా తగ్గిందని, కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వెల్ల లేదని, దీని దృష్ట్యా మండలంను కరువు ప్రాంతంగా ప్రకటించి, కరువు నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎల్ ని నో ప్రభావంతో సరైన వర్షాలు కురవక రైతులు వేసిన పంటలు సో యా, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు ఎండిపోయి రైతులు దిగుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, రైతులందరూ ఆందోళన చెందుతూ ఆత్మహ త్య చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని, వెంటనే సిరి కొండ మండలాన్ని కరువు మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. శు క్రవారం సిరికొండ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాల యంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు తాసిల్దార్ అర వింద్ కుమార్, ఉప తహసి ల్దార్ ఉపేందర్ కు వినతి పత్రం అందజేశారు. ప్రభు త్వం వెంటనే సిరికొండ మం డలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఈ సంద ర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాధర్, కోసే రావు పటేల్, గణేష్ మిలన్ నర్సయ్య,లక్ష్మన్న, రవి, లస్మన్న, సంజీవ్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు.



**జన్నారం,అక్టోబర్9(ప్రజాజ్యోతి)** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జన్నారం మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో,కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల,శ్రీ కృష్ణవేణి పాఠశాల, రాఘవేంద్ర లిటిల్ హార్ట్స్ పాఠశాల,స్లేట్ హై స్కూల్,మండలంలోని కలమదుగు వివేకానంద ఆంగ్లమ పాఠశాల లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రీ-సర్వే గ్రామాలలో తదుపరి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**





**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** రీ-సర్వే గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం తదుపరి చర్యలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి., డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, తాండూర్, నెన్నెల, భీమిని, వేమనపల్లి మండలాల తహసిల్దార్లు, అధికారులతో సమీక్షా సమావేశంను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రీ-సర్వే గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ అనంతరం తదుపరి చర్యల కార్యాచరణ వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో మిగిలి ఉన్న పనులను గుర్తించి, సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ తదుపరి సర్వే కార్యకలాపాలను వేగవంతం చేయాలని, ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

ఇంద్రవెల్లి ఘటనలో ఇరువర్గాల వారిపై కేసులు నమోదు.. ఆరుగురు అరెస్ట్

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ సాయన్న

వదంతులను నమ్మవద్దు.. అనుమానాలుంటే పోలీసులను సంప్రదించాలి

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న ఘటనకు సంబం ధించి ఇరువర్గాల వారిపై కే సులు నమోదు చేసి, ఆరు గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ. సాయన్న తెలిపా రు.ఈ ఘటనను కొందరు వ్యక్తులు వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే లా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప రంగా కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్ఐ హెచ్చరిం చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టడం, నిర్ధారణ కాని సమాచా రాన్ని ప్రచారం చేయడం చట్టరీత్యా సమస్య లకు దారితీస్తుందని స్పష్టం చేశారు.ప్రజలు సోషల్ మీ డియాలో వచ్చే ప్రతి సమా చారాన్ని గుడ్డిగా నమ్మవద్దని, నిజానిజాలు తెలుసు కోకుండా ఇతరులకు షేర్ చే యవద్దని సూచించారు. తప్పుడు ప్రచారాలకు, వదంతులకు ప్రభావితమై ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు




పాల్పడవద్దని కోరారు.ప్రాంతంలో శాంతి సామర స్యాలను కాపాడ టం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఏవైనా అనుమానాలు లేదా సమస్యలు ఉంటే సమీప పో లీస్ స్టేషన్‌ను సంప్రదిం చాలని ఎస్ఐ ఈ. సాయన్న తెలిపారు. ప్రజలు సంయ మనం పాటిస్తూ పోలీసుల కు సహకరించాలని కోరారు.

# హిందీ భాష సాంస్కృతిని సాంప్రదాయాన్ని కాపాడుకుందాం







## ఘనంగా హిందీ దివస్

**ఉట్నూర్, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి)** ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళా శాల హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత డాక్టర్ కె కాంచన వహించారు. ముఖ్యఅతిథి ప్రిన్సిపాల్,టీ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశానికి అధికారిక భాష అవసర మైంది. భారత రాజ్యాంగ సభ 1949 సెప్టెంబర్ 14న దేవనాగరి లిపిలోని హిందీని కేంద్ర ప్రభుత్వ అధికారిక భాషగా ఆమోదించింది. ఈ చారిత్రక నిర్ణయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్స రం సెప్టెంబర్ 14న హిందీ దివస్‌ను నిర్వహిస్తున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టి కల్ 343 ప్రకారం దేవనాగరి లిపిలోని హిందీని కేంద్ర ప్ర భుత్వ అధికారిక భాషగా పే ర్కొన్నారు. హిందీతో పాటు భారతదేశంలోని ఇతర భాషలకు కూడా రాజ్యాంగం గౌరవం కల్పించింది. హిందీ భారతదేశంలోని అనేక ప్రాంతాల ప్రజలను భాషాపరంగా అనుసంధానించే ముఖ్య మైన భాషగా ఉందని అన్నారు. హిందీ సాహిత్యం కూడా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సామా జిక జీవనాన్ని ప్రతిబింబి స్తుందని, ఒక భాషకు సం బంధించిన దినోత్సవం మా త్రమే కాదని, ఇది భారతదే శంలోని భాషా వైవిధ్యాన్ని గౌరవిస్తూ, హిందీ భాష అభివృద్ధి, వినియోగాన్ని ప్రో త్సహించే ముఖ్యమైన రోజు అని పేర్కొన్నారు. భారతదే శంలోని అన్ని భాషలను గౌరవిస్తూ హిందీ భాషను కూడా అభివృద్ధి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారుఈ కార్యక్రమం లో హిందీ అధ్యాపకులు డాక్టర్.కే కాంచన, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, రాణి, ముజీబ్, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీకి ఉచితంగా డెడ్ బాడీ ఫ్రీజర్ విరాళం

**?సోనాల, అక్టోబర్ 09 ( ప్రజాజ్యోతి ):** సోనాల గ్రామపంచాయతీ ప్రజల అవసరార్థం తులసరోజ వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి విలువైన డెడ్ బాడీ ఫ్రీజర్ (మృతదేహాల భద్రపరిచే యంత్రం)ను శనివారం గ్రామపంచాయతీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుడాల రవీందర్ కుడాల లలిత రవీందర్ నాళం కవిత హనుమాండ్లు ఒస సవిత శ్రీధర్ మాట్లాడుతూ... గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు, బంధువులు దూర ప్రాంతాల నుండి రావడానికి సమయం పడుతుందని, వేసవికాలంలో



మృతదేహాలను భద్రపరచడం నిరుపేద కుటుంబాలకు ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి ఈ ఫ్రీజర్‌ను పంచాయతీకి బహుకరించినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి ఉప సర్పంచ్ తుల శ్రీకాంత్, పంచాయతీ నాయకులు ఇర్ల అభిలాష్ భోజరాజు ఒస శ్రీకాంత్ మెడికల్ సూపర్వైజర్ ఉత్తమ్ ఫార్మసిస్ట్ మనోహర్ మరియు వార్డు సభ్యులు దాతల ఉదారతను కొనియాడారు. గ్రామాభివృద్ధికి, ప్రజల సౌకర్యార్థం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయ మని పేర్కొంటూ దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఫుట్ బాల్ పోటీల్లో రన్నరప్ గా నిలిచిన గిరిజన డిగ్రీ క ళాశాల ఫుట్ బాల్ జట్టు

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 9.(ప్రజా జ్యోతి)** కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వరంగల్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ క ళాశాలలో నిర్వహించిన 20 26- 27 పురుషుల అంతర్ కళాశాల ఫుట్‌బాల్ టోర్న మెంట్ ఫేస్1లో గిరిజన డిగ్రీ కళాశాల ఫుట్ బాల్ జట్టు రన్నరప్ గా నిలిచి క ళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల పిడి శ్రీనివాస్, క్రీ డాకారుల ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంశివకృ ష్ణ, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

## జీసీసీ కార్యకలాపాల పై అధ్యాయనం

ఉట్నూర్ చేరుకున్న ఐ ఐ ఎఫ్ ఎం భోపాల్ ప్రొఫెసర్ల బృందం





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 9,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటిడిఎ పరిధిలో గిరిజన సహకార సంస్థ (జిసిసి) చేప డుతున్న కార్యకలాపాలపై అధ్యాయనం నిమిత్తం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ (ఐఐఎఫ్ ఎం), భోపాల్ కు చెందిన ప్రొ ఫెసర్లు, శాస్త్రవేత్తల బృందం శుక్రవారం ఉట్నూర్ ను సం దర్శించింది. ఈ బృందం ముందుగా ప్రాజెక్ట్ అధికారి, ఐటిడిఎ ఉట్నూర్ మంద మకరందు ని మర్యాద పూ ర్వకంగా కలిశారు. అనంత రం జిసిసి ఉట్నూర్ డివిజ నల్ మేనేజర్ గుడిమళ్ల సం దీప్ కుమార్ జిసిసి ద్వారా చేపడుతున్న చిన్న అటవీ ఉత్పత్తుల (ఎంఎఫ్ పి) సేక రణ, ఎంఎస్ పి ద్వారా కొ నుగోలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, గిరిజన రైతులకు కల్పిస్తున్న మార్కెట్ సౌకర్యం తదితర కార్యకలాపాలను బృందానికి వివరించారు.అనంతరం బృందం డివిజనల్ కార్యాల యం, ఎంఎస్ఎంఈ యూని ట్లైన చిక్కీ తయారీ యూని ట్, మహువాలడ్డు తయారీ యూనిట్, ఎంఎఫ్ పి గోడౌన్ ను క్షేత్రస్థా యిలో సందర్శించి పరిశీలించారు. గిరిజన మహిళా సంఘాల ద్వారా తయారవుతున్న ఉత్ప త్తుల నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ఉత్పత్తులకు విలువ జోడించడంలో, గిరిజనులకు స్థిర మైన ఉపాధి కల్పించడంలో ఐటిడిఎ, జీసీసీ చేస్తున్న కృ షిని ఐఐఎఫ్ఎం ప్రొఫెసర్ల బృందం ప్రత్యేకంగా అభినం దించింది. ఈ అధ్యాయన నివేదిక జాతీయ స్థాయిలో గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్ కు ఉత్తమ విధానాలరూ పకల్పనకు దోహదపడు తుందని తెలిపారు.ఈ సందర్భంలోఐఐఎఫ్ ఎం ప్రొఫెసర్లు శాసుల్ గాషిందే, షార్దిందు పాండే, ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధి కారులు గణేష్, గోపి ప్రసా ద్, లక్ష్మా రెడ్డి, జీసీసీ సీని యర్ మేనేజర్ సంతోష్ కు మార్, సిబ్బంది పాల్గొన్నా రు.

# ప్రతీ బిడ్డ రోజూ పాఠశాలకు వెళ్లాలి







**గ్రామాభివృద్ధి, యువత నైపుణ్యాలపై కీలక తీర్మానాలు**

**విద్య, ఆరోగ్యం, ఉపాధిరం గాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

**ఐటీడీఏ పీఓ మంద మకరందు**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 9,( ప్రజా జ్యోతి)** గిరిజన గ్రామాల్లో విద్యాభి వృద్ధి, చిన్నారుల ఆరోగ్యం, యువతకు నైపుణ్య శిక్షణ, ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో స మగ్ర కార్యాచరణ రూపొందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మందమ కరందు సూచించారు. ఉట్నూరు మండల కేంద్రంలోని కొమరం భీం కాంప్లెక్స్ సమావేశ మందిరంలో నాలుగు జిల్లాల సార్మేడీలతో విద్య, గ్రామాభివృద్ధి అంశాల పై ఆయన సమీక్షా సమావే శంనిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల సమగ్ర అ భివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థుల పాఠశాల హాజరు, చిన్నారుల పోషణ, యువతకు వృత్తి నైపుణ్యాల కల్పన, పెద్దలకు ఉపాధి అవకాశాలపై పలు కీలక సూచనలు చేశారు. ప్రతి బి డ్డ పాఠశాలకు వెళ్లేలా గ్రామ స్థాయిలో తీర్మానాలు చేయాలి, 6 నుంచి 18 సంవ త్సరాల వయస్సు గల ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లేలా గ్రామ స్థాయిలో ప్రత్యేక తీర్మానాలు చేయాలని పీఓ సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా పాఠశాలకు దూరం కాకుండా గ్రామ పెద్దలు, పటేళ్లు, నాయకులు, తల్లిదండ్రులు సమన్వయంతో బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి, పిల్లలందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా గ్రామీణ తీర్మానాలను ఆమోదించాలని తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎవరైనా విద్యార్థులు పాఠశాలకు వెళ్ల కుండా బయట తిరుగుతు న్నట్లు గుర్తిస్తే వారి తల్లిదం డ్రులు, గ్రామ పెద్దలు, విద్యా ర్థి సంఘాల ప్రతినిధులు బా ధ్యతగా స్పందించి తిరిగి పా ఠశాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే రవాణా సదు పాయాలు కల్పించి అయినా విద్యార్థులను పాఠశాల లకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు ఐటీడీఏ తరఫున అవసర మైన సహకారం అందిస్తామ ని స్పష్టం చేశారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జననం నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు ఆరోగ్యంగా, బలంగా ఎ దిగేలా తగిన చర్యలు తీసు కోవాలని మంద మకరందు సూచించారు. పిల్లల వయ స్సుకు అనుగుణంగా బరు వు, ఎత్తు ఉండేలా అంగన్ వాడీ కేంద్రాల సిబ్బంది, తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టి కాహారాన్ని చిన్నారులకు సక్రమంగా అందించడంతో పా టు, స్థానికంగా లభించే పో షక విలువలు కలిగిన ఆహా ర పదార్థాలను కూడా విని యోగించాలని తెలిపారు. ప్రతి ఇంటి పెరట్లో లభించే మునగాకు, ఉసిరి, నిమ్మ, జామ వంటి పోషకాలు స మృద్ధిగా ఉన్న ఆహార పదా ర్థాలను పిల్లలకు అందించ డం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని పేర్కొ న్నారు. చిన్నారుల్లో పోషకా హార లోపాన్ని నివారించేం దుకు గ్రామస్థాయిలో అవగా హన పెంచాలని సూచించా రు. 18 ఏళ్లు దాటిన యువ తకు వృత్తి నైపుణ్య శిక్షణ, గిరిజన యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదిగేందుకు వృత్తి నైపుణ్యా లు ఎంతో అవసరమని పీఓ పేర్కొన్నారు. 18 ఏళ్లు పూర్త యిన ప్రతి యువతీ, యువకుడు కనీసం ఒక వృత్తిలో నైపుణ్యం సంపాదించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఆదిలాబాద్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్లు, పారి శ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీ ఐ), కృషి విజ్ఞాన కేంద్రం (కే వీకే), జన్ శిక్షణ్ సంస్థాన్ వంటి శిక్షణా కేంద్రాల్లో అం దుబాటులో ఉన్న రెండు నుంచి మూడు నెలల స్వ ల్పకాలిక కోర్సులను యువత పూర్తి చేసి ధ్రువపత్రాలు పొందేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. శిక్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్వయం ఉపాధిరం గంలోనూ స్థిరపడేందుకు అ వకాశం ఉంటుందని తెలి పారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశా లు కల్పించాలని, గ్రామాల్లో 30 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉపాధి కార్యక్రమంలో నిమగ్నమ య్యేలా ప్రణాళికలు రూపొందించాలని మంద మకరందు సూచించా రు. వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటి ప్రాసెసింగ్, మహిళా సంఘాల ద్వారా చిన్న వ్యా పారాలు వంటి ఉపాధి మా ర్గాలను ప్రోత్సహించాలని తెలిపారు. స్థానిక వనరులను సద్విని యోగం చేసుకుంటూ కుటుంబాల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవా లని, గ్రామాల్లో ఉపాధి అవ కాశాలను విస్తరించి ప్రతి ఒక్కరూ ఆర్థికంగా స్వావ లంబన సాధించే దిశగా కృ షి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో విద్య, ఆరో గ్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అంశాలకు సమాన ప్రా ధాన్యత ఇవ్వాలని పేర్కొ న్నారు. దసరా అనంతరం గ్రామస్థాయిలో ప్రత్యేక స మావేశాలు ఈ కార్యక్రమా ల అమలులో భాగంగా దసరా పండుగ అనంతరం . గ్రా మాల్లో పటేళ్లు, సార్మేడీలు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల తో ప్రత్యేక సమావేశాలు ని ర్వహించాలని పీఓ ఆదేశిం చారు. ఈ సమావేశాల్లో పి ల్లల పాఠశాల హాజరు, చిన్నారుల పోషణ, యువత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై చర్చించి, గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళి కలు రూపొందించాలని సూ చించారు. ప్రతి గ్రామంలో ఎంతమంది పిల్లలు పాఠశా లకు వెళ్తున్నారు, ఎంతమంది యువత శిక్షణ పొందుతున్నారు, ఎంతమంది ఉపాధి కార్యక్రమాల్లో పాల్గొం టున్నారు అనే వివరాలను సేకరించి, అభివృద్ధి కార్యక్ర మాల పురోగతిని ఎప్పటిక ప్పుడు సమీక్షించాలని తెలిపారు. 100 శాతం పాఠశాల హాజరు సాధించిన గ్రామాలకు ప్రోత్సాహకాలు గ్రామం లోని పిల్లలందరూ పాఠశాలకు హాజరవుతూ 100 శా తం పాఠశాల హాజరు సాధించిన గ్రామాలను ఐటీడీ ఏ తరఫున ప్రత్యేకంగా గుర్తించి, ఆయా గ్రామాల పటేళ్లు, నాయకులను సన్మానిం చడంతో పాటు ప్రశంసాప త్రాలు అందజేస్తామని మంద మకరందు తెలిపారు. విద్యాభివృద్ధిలో ముందున్న గ్రామాలను ప్రోత్సహించేం దుకు ప్రాధాన్యత ప్రతి పది కన ప్రభుత్వ, ఐటీడీఏ నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి గ్రామం విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో ఆదర్శం గా నిలిచేలా గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు స మన్వయంతో పనిచేయాల నిపిలుపు నిచ్చారు. గిరిజన గ్రామాల్లో ప్రతి బిడ్డకు విద్య, ప్రతి చిన్నారికి ఆరోగ్యం, ప్రతి యువతకు నైపుణ్యం, ప్రతి కుటుంబానికి ఉపాధి అ వకాశాలు కల్పించడమే లక్ష్యంగా అందరూ బాధ్యతతో పనిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు స్పష్టం చేశారు.

## రెవెన్యూ, అటవీ భూముల హద్దుల గుర్తింపునకు రీ సర్వే

**ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 8 ,( ప్రజాజ్యోతి )** నిర్మల్ జిల్లాలో రెవెన్యూ, అటవీ భూ సమస్యల పరిష్కారానికి భూముల రీసర్వే ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూముల రీ సర్వే, అటవీ--రెవెన్యూ భూ సమస్యలు, ఇసుక అక్రమ రవాణా నియంత్ర ణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, రీ సర్వే ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ, నీటిపారుదల తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, భూ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో దేవిదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి





**నిర్మల్ రైజింగ్--2047 లక్ష్యంగా వినూత్న వ్యాపారాలకు చేయూత**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 9,( ప్రజాజ్యోతి )** నిర్మల్ జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిర్మల్ రైజింగ్--2047 లక్ష్యంగా స్థానిక వనరులను వినియోగించుకుంటూ కొత్త పరిశ్రమలు, వ్యాపారాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అమూల్ సంస్థను ఆదర్శంగా తీసుకొని జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే వనరులతో వినూత్న వ్యాపారాలను ప్రారంభించేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలని తెలిపారు. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే జీవవిచ్ఛిన్న ఉత్పత్తుల తయారీతో పాటు పరిశుభ్రమైన ఆహార ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఎల్‌డీఎం రామ్ గోపాల్, పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

## కరువు తీవ్రతపై శాస్త్రీయ అంచనాలు.. ముందస్తు చర్యలకు సిద్ధం కావాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా







**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 9 ,( ప్రజాజ్యోతి )** ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి, ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వర్షపాత లోటు, పంటల పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాభావ పరిస్థితులు, కరువు మండలాల గుర్తింపు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పనులు, జల సంరక్షణ చర్యలపై సమీక్షించారు.సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ లోటు నమోదైన మండలాలను గుర్తించి, కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. పంటల సాగు విస్తీర్ణం, పంటల ఎదుగుదల, పంట నష్టం, నేలలో తేమ, భూగర్భ జలాల స్థితిగతులను శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా విశ్లేషించాలని తెలిపారు. ఉపగ్రహ చిత్రాలు, రిమోట్ సెన్సింగ్ సమాచారం, క్షేత్రస్థాయి పరిశీలనలను సమన్వయం చేసి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో వర్షాభావ పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయి వివరాలను సేకరించాలని, వాస్తవ పరిస్థితుల ఆధారంగా సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవసరాలను గుర్తించి అర్హులైన వారందరికీ ఉపాధి కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని, చెరువుల్లో పూడికతీత, ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోరుబావుల రీచార్జ్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. బోరుబావుల రీచార్జ్ పనులను అక్టోబర్ 25 నాటికి పూర్తి చేయాలని సీఎస్ సూచించిన నేపథ్యంలో, సంబంధిత అధికారులు నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించడంతో పాటు, గ్రామీణ ఉపాధి అవసరాలు, వలసల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. జల సంరక్షణ పనులను ప్రాధాన్యతతో చేపట్టి అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.వర్షాభావ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, నీటిపారుదల శాఖ ఈఈ అనిల్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, సీపీఓ గంగారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరువు కోరల్లో నేరడిగొండ.. రైతులను ఆదుకోండి!

**-- మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలి: బీఆర్ఎస్ డిమాండ్**

**నేరడిగొండ, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని వెంటనే కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పలు కీలక డిమాండ్లను ముందుకు తెచ్చారు.మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి, ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు చేతికి అందకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.నేరడిగొండ మండలాన్ని అధికారికంగా కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించడంతో పాటు, పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాల వారీగా నష్టపరిహారం లెక్కించి



తగిన ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతు కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సంక్షేమమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని, కరువు పరిస్థితులతో నష్టపోయిన నేరడిగొండ మండల రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలి




**ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలి**

**మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 9 ,( ప్రజాజ్యోతి )** చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లాలో నిర్వహించిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకం అమలుపై స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ కుటుంబాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. అయితే, మూడేళ్లు గడుస్తున్నా ఈ పథకం అమలుకు నోచుకోలేదని విమర్శించారు. దళితుల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితమవుతోందని ఆరోపించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించే కార్యక్రమం అమలులో ఉండేదని, ప్రస్తుతం పథకం పేరు మార్చి అంబేద్కర్ అభయహస్తంగా ప్రకటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అమలు జరగడం లేదని ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగే వరకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.

**ఆరు ప్రధాన డిమాండ్లు**

1. అంబేద్కర్ అభయహస్తం: ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించే పథకాన్ని వెంటనే అమలు చేయాలి.
2. ఎస్సీలకు రిజర్వేషన్లు: తెలంగాణలో ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, జనాభా దామాషా ప్రకారం న్యాయం చేయాలి.
3. నిరుద్యోగ భృతి: నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి అందించాలి.
4. ఉద్యమకారులకు ఇళ్లు: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు స్థలాలు కేటాయించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.
5. ఎస్సీ కార్పొరేషన్: ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు భాగాలుగా విభజించి, తక్షణమే చైర్మన్లను నియమించాలి.
6. జర్నలిస్టులకు గృహ వసతి: జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

**పలువురు నాయకుల హాజరు**

ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కమిటీ నాయకుడు రవీందర్, జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకె ప్రభాకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బొమ్మెన తిరుపతి, జన సాహిత్య అకాడమీ చైర్మన్ పాముల రమణ, 57 ఉప కులాల రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం గంగాధర్, ప్రజా కళాకారుడు దరువు భోజన్న, నరేష్, కత్తి విష్ణు, దాసరి శివ, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

**సోన్,అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** సోన్ మండల కేంద్రంలోని జఫ్రాపూర్ మరియు పాక్ పట్ల గ్రామ విద్యుత్ వినియోగదారులు తెలియజేయునది ఏమనగా, సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా రేపు అనగా 10.10.2026న ఉదయం 10:00 గంటల నుండి 11:30 గంటల వరకు జఫ్రాపూర్ మరియు పాక్ పట్ల గ్రామ ప్రజలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగును. కావున విద్యుత్ వినియోగదారులు మరియు గ్రామ ప్రజలు సహకరించ గలరని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కే శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలు తెలిపారు.

## పూల పండుగ బతుకమ్మ

**బేల ప్రభుత్వ పాఠశాలలో సంబరాల కోలాహలం**



**ఆదిలాబాద్ టౌన్ అక్టోబరు 9 ( ప్రజా జ్యోతి)** బేల మండలం లోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, బతుకమ్మ పాటలను పాడి నృత్యం చేస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి ఒలపు భాగ్యలక్ష్మి, మండల విద్యాధికారి మహాలక్ష్మి, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు బేబీ తాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను వివరించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవాన్ని, ఐకమత్య భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్ము కృష్ణకుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఆలయానికి ఆర్థిక సహాయం అందించిన నల్ల వినయ్ రెడ్డి



**లక్ష్మణ చాంద, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)** మండలంలోని కనకాపూర్ గ్రామంలో గల దుర్గాదేవి ఆలయానికి వడ్యాల్ గ్రామానికి చెందిన నల్ల వినయ్ రెడ్డి కనకాపూర్ గ్రామ ప్రజల కోరిక మేరకు దుర్గాదేవి అమ్మవారి ఆలయానికి రంగులు వేయించేందుకు తన వంతుగా 1లక్ష 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం రోజున గ్రామస్తులకు అందించారు.నల్ల వినయ్ రెడ్డి కి కనకాపూర్ గ్రామ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మీరు చేసే ఈ పవిత్ర కార్యానికి మీరు అందించిన సహకారం ఎంతో గొప్పది. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు మా గ్రామంపై మీకున్న గౌరవానికి, దైవభక్తికి, సమాజం పట్ల మీకున్న బాధ్యతకు నిదర్శనం. అని గ్రామస్తులు నల్ల వినయ్ రెడ్డిని కొనియాడారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు వారిపై ఎల్లప్పుడూ ఉండాలని, మీరు భవిష్యత్తులో వేసే ప్రతి అడుగు విజయవంతం కావాలని, మీరు చేపట్టే ప్రతి మంచి కార్యం ప్రజల మన్ననలు పొందాలని, మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని గ్రామస్తులు కోరారు.

## రెవెన్యూ, అటవీ భూముల హద్దుల గుర్తింపునకు రీ సర్వే

**ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 9 ,( ప్రజాజ్యోతి )** జిల్లాలో రెవెన్యూ, అటవీ భూ సమస్యల పరిష్కారానికి భూముల రీ సర్వే ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూముల రీ సర్వే, అటవీ–-రెవెన్యూ భూ సమస్యలు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ, నీటిపారుదల తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, భూ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో దేవిదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విరల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తుగా నందిగామ దిశ మోడల్ పాఠశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు



**అదిలాబాద్ టౌన్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి )** తలమడుగు మండలంలోని ఝరిపునాగూడ పాఠశాల సముదాయ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో నందిగామ దిశ మోడల్ స్కూల్ (డీఎంఎస్) పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల సముదాయ పరిధిలోని వివిధ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు బతుకమ్మలను అందంగా అలంకరించి, పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఝరి -పూనాగూడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి మాట్లాడుతూ పండుగ విశిష్టతను, బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పూనాగూడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పూనగూడ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు అశోక్,దివాకర్, విలాస్, సంతోష్, భగవన్లు, వినోద్, సారిక, కమల,దివ్య చంద్రబాన్ రామారావు,శంకర్,అర్జున్ విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్యం లేని ప్రయాణం గమ్యాన్ని చేరుకోలేదు మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం




**దిలావర్ పూర్ ,అక్టోబర్ 9,( ప్రజాజ్యోతి ).**విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం.లక్ష్యం లేని ప్రయాణం గమ్యాన్ని చేరుకోలేదని, ప్రతి విద్యార్థి తాను భవిష్యత్తులో ఏమి కావాలనుకుంటున్నాడో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం సూచించారు.శుక్రవారం దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పదో తరగతి పూర్తి చేసుకుని కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఈ దశ ఎంతో కీలకమని పేర్కొన్నారు. కళాశాల జీవితం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి చక్కని వేదికగా నిలుస్తుందన్నారు.కళాశాలలో ఏర్పడే కొత్త స్నేహాల్లో మంచి స్నేహాన్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని, స్నేహితుల ప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపై ఉంటుందని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, స్పష్టమైన లక్ష్యంతో చదువులో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.ఈ కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం నిర్మల్ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తుకారాం, ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, కళాశాల ఏజీఎంసీ రామారావు, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వివేకానంద పాఠశాల లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**విద్యార్థినుల ఆటపాటలతో సందడిగా మారిన పాఠశాల ప్రాంగణం**



**సారంగాపూర్, అక్టోబర్ 09, ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ముందస్తు బతుకమ్మ పండుగ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పూల పండుగ విశిష్టతను చాటుతూ సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నేరెళ్ల ఉషారాణి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. తెలంగాణలో బతుకమ్మను పూల పండుగగా జరుపుకుంటారని, ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు, యువతులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొంటారని విద్యార్థులకు వివరించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మన సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.బతుకమ్మ పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆటపాటలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. విద్యార్థులు సంప్రదాయ పండుగల పట్ల ఆసక్తి కనబరుస్తూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సముద్రాల గీత, వైస్ ప్రిన్సిపల్ మర్రి కళ్యాణ్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి**

**ఎస్పీ నితికా పంత్**



**ఆసిఫాబాద్, అక్టోబరు 9 ప్రజా జ్యోతి** దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.మండపాలను ఏర్పాటు చేసేటప్పుడు ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. రహదారులు, కాలిబాటలను ఆక్రమించరాదని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవడంతోపాటు షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భద్రత కోసం ప్రత్యేక వాలంటీర్లను నియమించి, వారి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పాటలకు దూరంగా ఉండాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ కాని సందేశాలను ఇతరులకు పంపించరాదన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ ఎంపీల పోరాటం

**రాష్ట్రపతిని కలిసి ఓటు హక్కుల రక్షణకు గళం వినిపించేందుకు కార్యాచరణ**

**ప్రియాంక గాంధీతో సమావేశమైన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఇతర కాంగ్రెస్ ఎంపీలు**



**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజా జ్యోతి):** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల ఓటు హక్కుల రక్షణ లక్ష్యంగా రాష్ట్రపతిని కలిసి తమ గళాన్ని వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కార్యాచరణపై చర్చించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో జరిగిన ఈ సమావేశంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పరిరక్షించడం, ప్రజల ఓటు హక్కులకు భంగం కలగకుండా చూడటం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ అంశాలపై రాష్ట్రపతిని కలిసి తమ నిరసనను తెలియజేయడంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఎంపీలు సమాలోచనలు జరిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని కాపాడటం, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తోందని పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసం కాంగ్రెస్ ఎంపీలంతా ఐక్యంగా ముందుకు సాగుతూ ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని నిర్ణయించారు.

# వానాకాలం పంటలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

**యాసంగి సాగు ప్రణాళికను నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**మంచిర్యాల, 9,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో వానాకాలం పంటల పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రానున్న యాసంగి 2026--27 సాగు ప్రణాళికను నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, సాగునీటి వనరులకు అనుగుణంగా రూపొందించాలని సూచించారు. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వానాకాలం పంటలు, వర్షపాతం, వ్యవసాయ కార్యకలాపాలు, యాసంగి సాగు ప్రణాళిక, తాగునీటి సరఫరా, జల సంరక్షణ పనుల పురోగతిపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 17 శాతం లోటు నమోదైందని, అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు వర్షపాత లోటు 99 శాతంగా ఉందని తెలిపారు. వానాకాలం 2026లో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి కోటి 31 లక్షల 38 వేల 611 ఎకరాల్లో సాగు నమోదైందన్నారు. ఇందులో 57 లక్షల 4 వేల 59 ఎకరాల్లో వరి, 48 లక్షల 43 వేల 606 ఎకరాల్లో పత్తి, 5 లక్షల 92 వేల 472 ఎకరాల్లో మొక్కజొన్న, 7 లక్షల 97 వేల 772 ఎకరాల్లో పప్పుధాన్యాలు సాగయ్యాయని వివరించారు.వర్షపాత లోటు కారణంగా కొన్ని జిల్లాల్లో పంటలు వాడిపోవడం, ఎండిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా పత్తి, వరి తదితర పంటలపై వర్షాభావ ప్రభావాన్ని అంచనా వేసి రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలన్నారు. యాసంగి 2026--27లో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 65 లక్షల 89 వేల 293 ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం 29.3 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు.నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వరి సాగును నిరుత్సాహపరుస్తూ, ఆయా ప్రాంతాలకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు ఐడీల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయడంతో పాటు వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలన్నారు. వ్యవసాయ



శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ రైతు వేదికలు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా రైతులకు సకాలంలో సూచనలు అందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు నిరంతర తాగునీరు అందించేలా మిషన్ భగీరథ, సాగునీటి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. తాగునీటి అవసరాల కోసం కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో 14, గోదావరి నది పరివాహక ప్రాంతంలో 20 కలిపి మొత్తం 34 జలాశయాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఏడాది పొడవునా తాగునీటి అవసరాలకు సరిపడా ముడి నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని, వాటిపై ఆధారపడిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లలోనూ తగిన నీటి నిల్వలు ఉండేలా చూడాలన్నారు.గ్రామాల్లో చేతిపంపులు, నీటి సరఫరా పథకాలు, బహిరంగ బావులు సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక నీటి వనరులను పరిరక్షిస్తూ నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో విద్యుత్, సాగునీరు, ప్రజారోగ్య ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తాగునీటి సరఫరాను నిరంతరం సమీక్షించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో జలాశయాల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని వినియోగించుకునేందుకు తాత్కాలిక పంపుల ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఉపాధి పనులతో జల సంరక్షణరాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది క్రియాశీల కూలీలు ఉన్న నేపథ్యంలో వి.బి.జి. రామ్ జి పథకం కింద కూలీల సమీకరణను సమర్థవంతంగా చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ అవసరమైన కూలీలను పనుల్లో భాగస్వాములను చేయాలన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని



సూచించారు.తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మ్యాజిక్ సోక్‌పిట్లు, 50 వేల ఫామ్ పాండ్లు, 12 వేల పెర్కొలేషన్ ట్యాంకులు, 12 వేల బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు వివరించారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు ఈ నిర్మాణాలు ఉపయోగపడేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు.స్వచ్ఛ భారత్ మిషన్ కింద కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణాలను చేపట్టాలని, పనిచేస్తున్న బోరుబావుల వద్ద సోక్‌పిట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎండిపోయిన బోరుబావుల వద్ద భూగర్భ జలాల పునరుద్ధరణకు అనువైన రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో నీటి సంరక్షణకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, సాగునీటి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. రైతులకు సకాలంలో వ్యవసాయ సలహాలు అందించడం, ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయడం, నిరంతర తాగునీటి సరఫరా, ఉపాధి పనుల వేగవంతం, జల సంరక్షణ నిర్మాణాల లక్ష్యాల సాధనపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మొబైల్ ద్వారా పాల్గొనగా, మంచిర్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి అనిత, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

**చెడు వ్యసనాలకు, సైబర్ మోసాలకు దూరంగా ఉండాలి**

**సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలి..**

**పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన**

**కామారెడ్డి,** విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈ దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుతూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు, సైబర్ మోసాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను విచక్షణతో వినియోగించాలని, తెలియని వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, చిన్న వయస్సులోనే తప్పుదోవ పట్టించే అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని పోలీస్ కళాబృందం విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం నింపుతూ నేటి సమాజంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

**ప్రేమ పేరుతో మోసాలకు గురికావద్దు**

నేటి రోజుల్లో ప్రేమ పేరుతో పరిచయాలు పెంచుకొని యువతను మోసం చేసే ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఇలాంటి విషయాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కార్యక్రమంలో సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, చిరునామాలు, బ్యాంకు వివరాలు, ఓటీపీలు అందించవద్దని హెచ్చరించారు. తెలియని వ్యక్తులను గుడ్డిగా నమ్మకుండా, అనుమానాస్పద పరిచయాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.

**మైనర్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు**

మైనర్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, వాహనం నడిపేందుకు చట్టబద్ధమైన వయస్సు వచ్చే వరకు మైనర్లు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు చిన్న వయస్సులోనే వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని వివరించారు.

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని పోలీస్ కళాబృందం సభ్యులు వివరించారు. స్నేహితుల ఒత్తిడికి లోనై చెడు అలవాట్లకు బానిసలు కావద్దని, ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి ప్రోత్సహించినా, వాటి సరఫరాకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.